www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 16 జులై 2025
5
వైఎస్ఆర్



మద్యవర్తిత్వం ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప

మధ్యవర్తిత్వం ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని అన్నారు. మంగళవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో మధ్యవర్తిత్వంపై అవగాహన ప్రచారంలో భాగంగా బ్యాంక్ అధికారులకు, చిట్‌ఫండ్ ప్రతినిధులకు, ఫైనాన్స్ కంపెనీ వారికి, ఎపిఎస్ఆర్‌టిసి అధికారులకు, ప్రజలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యవర్తిత్వ ప్రాముఖ్యతను తెలియజేశారు. మధ్యవర్తిత్వ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి, ఎక్కువ కేసులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా మధ్యవర్తిత్వ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

గండికోటలో దారుణం

- ఇంటర్ విద్యార్థినిపై అత్యాచారం.. హత్య!
- ముళ్లపొదల్లో మృతదేహం
- పోలీసుల అదుపులో అనుమానితుడు?
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి, డిఎస్‌పి
- తల్లడిల్లిన తల్లిదండ్రులు



గండికోట ప్రాంతంలో డాగ్‌స్క్వాడ్‌తో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన గండికోటలో ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి మంగళవారం ఉదయం కలకలం రేపింది. ఎక్కడ, ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పోలీసుల కథనం మేరకు వివరాలు... ప్రొద్దుటూరులోని సార్వకట్ట వీధికి చెందిన బాలిక పట్టణంలోని గీతం జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. ఆమె సోమవారం ఉదయం యథావిధిగా కళాశాలకు వచ్చి తోటి స్నేహితులతో గండికోటకు వెళ్తున్నానని, కళాశాల వదిలే సమయానికి వస్తాను అని చెప్పి లోకేష్ అనే వ్యక్తితో బైక్‌పై వెళ్లింది. వారు గండికోటకు వెళ్లినట్లు టోల్ ప్లాజా వద్ద సిసి టివి పుటేజీలో దృశ్యాలు కన్పించాయి. తిరుగు ప్రయాణంలో బైక్ పైన లోకేష్ ఒక్కడే వెళ్లినట్లు సిసి పుటేజీలో కన్పించింది. ఒకవైపు సాయంత్రం 7.30 అయినా కళాశాల నుంచి ఇంటికి రాలేదని తల్లిదండ్రులు ప్రొద్దుటూరులోని ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టారు. బాలిక కోసం వెతకడం ప్రారంభించారు. పోలీసులు సిసి టివిలు తనిఖీ చేశారు. ఇదే సమయంలో మంగళవారం ఉదయం గండికోటలోని రంగనాథస్వామి దేవాలయం వెనుక భాగాన ముళ్లపొదల్లో బాలిక మృతదేహం విగతజీవిగా కన్పించింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకుని అలా చూసి వారి హృదయం తల్లడిల్లిపోయింది. బాలిక మృతి విషయం తెలుసుకున్న గండికోటలోని ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. ఒక్కసారిగా బాలిక మృతదేహం చూసి నివ్వెరపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వాస్తవానికి బాలికది ఎర్రగుంట్ల మండలం అల్లుదుర్తి (హనుమాన్ గుత్తి) గ్రామం. అదే గ్రామంలోని లోకేష్ అనే యువకుడు ప్రేమ పేరిట వేధించినట్లు గతంలో పోలీసుస్టేషన్‌లో కూడా కేసు నమోదైంది. ఆ తర్వాత ఆరు నెలల కిందట ప్రొద్దుటూరుకు వచ్చి సార్వకట్ట వీధిలో నివాసం ఉంటున్నట్లు సమాచారం. కాగా అనుమానితుడిగా భావిస్తున్న లోకేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. లోకేష్‌తో పాటు ఈ సంఘటనలో ఎవరెవరు పాల్గొన్నారనే కోణంలో కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు.



అనుమానితుడు లోకేష్

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి

సంఘటన విషయం తెలుసుకున్న ఎస్‌పి ఇ.జి.అశోక్‌కుమార్ వెంటనే సంఘటనా స్థలానికిచేరుకుని హత్యకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలిక మృతికి కారణాలు ఇంకా పూర్తిగా తెలియలేదని తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఆమేరకు విచారణ చేపట్టనున్నారు. డాగ్ స్క్వాడ్‌తో క్లూస్ టీం విచారిస్తుందన్నారు. ఆయనతో పాటు జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, డిఎస్‌పిలు వెంకటేశ్వరరావు, భావన, ట్రైనీ డిఎస్‌పి భవాని, అర్బన్ సిఐ లింగప్ప, ఎస్ఐ హైమావతి ఉన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

జమ్మలమడుగులోని గండికోటలో ప్రొద్దుటూరుకు చెందిన విద్యార్థిని హత్య కేసులో నిందితుడికి కఠిన దండన విధించాలని ఎపి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ డిమాండ్ చేశారు. ప్రేమ పేరుతో నమ్మించి చంపిన అల్లుగుత్తి లోకేష్‌పై కఠిన చర్యలతో పాటు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉరితీయాలని పిఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేష్ కత్తి, ఎస్‌డిపిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జెష్ఠాది భాస్కర్ పేర్కొన్నారు. వారు ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జి డిప్యూటీ తహశీల్దార్ సుదర్శన్‌కు వినతి పత్రం అందజేశారు. విద్యార్థినికి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రొద్దుటూరు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుర్రం దేవేంద్ర పేర్కొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

గండికోట పర్యాటక ప్రాంతంలో మహిళలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి హరిబాబు తెలిపారు. మంగళవారం స్థానిక ఓ ప్రయివేట్ కళాశాలలో ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ తెలిపారు. నిత్యం గండికోట ప్రాంతం పర్యాటకుల సందర్శనాంతం కళకళలాడుతుందని, ఈ తరుణంలో అఘాయిత్యా సంఘటనలు జరగడం చాలా బాధాకరమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటక ప్రాంతాలలో ఇలాంటి సంఘటనలు జరగాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బాలికపై లోకేష్ అనే వ్యక్తి హత్య చేయడం దుర్మార్గపు చర్యన్నారు. నిందితుడిని అరెస్టు చేసి తగిన చర్యలు కఠిన శిక్షను అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఖాదర్ పాల్గొన్నారు.



ముళ్లపొదల్లో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిందితులను కఠినంగా శిక్షిస్తాం : మంత్రి

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా గండికోటలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని హత్యకు గురికావడంపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రొద్దుటూరులోని ఓ ప్రయివేటు జూనియర్ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గండికోటలో దారుణ హత్యకు గురికావడంపై ఆమె విచారం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడానన్నారు. దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి సానుభూతి వ్యక్తంచేశారు. మహిళలు, బాలికలపై హత్యలకు, హత్యాచారాలకు పాల్పడితే సహించేది లేదని, ఉక్కుపాదంతో అణచివేస్తామని స్పష్టం చేశారు.

పేదరికాన్ని రూపుమాపేందుకే పి4

- ఇన్‌ఛార్జి కలెక్టర్ అతిది సింగ్

ప్రజాశక్తి - కడప

రాష్ట్రంలోని పేదరికాన్ని రూపు మాపడమే లక్ష్యంగా, స్వర్ణ ఆంధ్ర - 2047 విజన్‌ప్లాన్‌లో భాగంగా ప్రభుత్వం పి-4 విధానాన్ని రూపొందించిందని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో జిల్లాలో పి4 సర్వే నిర్వహణపె పి-24 నిర్వహణపై రాష్ట్ర సమగ్ర టీమ్ ప్రతినిధి సాయి సాత్విక్ పవర్ పాయింట్ ద్వారా అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే బంగారు కుటుంబాలను ప్రాథమికంగా సర్వే ద్వారా గుర్తించామన్నారు. అందుకు సంబంధించి తుది జాబితాను తయారు చేసేందుకు గ్రామ వార్డు సభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామసభల నిర్వహణకు 17 లోపు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస ఈ నెల 18 నుండి ఆగస్టు 5 వరకు సర్వే నిర్వహించాలని తెలిపారు. అందుకు సంబంధించి మాస్టర్ ట్రైనర్ల ద్వారా జిల్లాలో ఇప్పటికే జిల్లాలో 78 వేల బంగారు కుటుంబాలను గుర్తించారన్నారు. స్వర్ణాంధ్ర జీరో ప్రావర్టీ - పి 4 (పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్ట నర్ షిప్) ద్వారా ఎంపిక చేసిన బంగారు కుటుంబాల జాబితాను మరోసారి పునః పరిశీలన చేసి, మార్పులు చేర్పులతో తుది జాబితాను తయారు చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 10 నాటికి తుది జాబితాలో ఉన్న బంగారు కుటుంబాలను మార్గ దర్శకులు దత్తత తీసుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుం టుందన్నారు. ఈ సర్వేలో రోజుకు పర్ఫార్మెన్స్ ఇండికెటర్ నివేదికను నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పారు. మార్గదర్శుల సహాయ సహకారాలతో బంగారు కుటుంబాలను కూడా ఉన్నత స్థానానికి తీసుకుని రావడానికి కార్యాచరణ ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. బంగారు కుటుంబాలను ఆర్థికంగానే కాకుండా చదువు, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల పరంగా అభివృద్ధి చేసేందుకు మార్గదర్శులు తోడ్పాటును అందిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలలోకి విస్తృతంగా తీసుకుని వెళ్లి రూట్స్, యాప్ ద్వారా వివరాలను సేకరించి దిగ్విజయం చేయాలని ఇంచార్జి కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కెఎంసి కమిషనర్ మనోజ్‌రెడ్డి, కడప, జమ్మలమడుగు, బద్వేలు ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, సిపిఒ హజరతయ్య, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు రాజ్యాలక్ష్మి, ఆది శేషారెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్ర నాయక్, పరిశ్రమల శాఖ జిఎం చాంద్ బాషా, డిపిఒ ఎఒ ఖాదర్ బాషా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి : సిఐటియు



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మెలో భాగంగా కార్పొరేషన్ కార్యాలయం ఎదుట 3వ రోజు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 36 ప్రకారం వేతనాలు పెంచకుంటే సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. నెల రోజుల నుంచి అనేక రూపాల్లో నిరసనలు, ధర్నా లు చేస్తున్న ప్రభుత్వం పట్టించు కోవడం లేదని విమర్శించారు. పెరిగిన ధరలు, ఫీజుల భారం వల్ల కుటుంబ పోషణ, ఇంటి బాడుగలు కట్టు కోలేక కార్మికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఈ నెల 4న విజయవాడలో జరిగిన ధర్నాలో సమ్మె ప్రకటించినా, ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చినా పట్టించుకొక పోవడం తో నిరవధిక సమ్మె కు దిగారని తెలిపారు. దీనికి ప్రభుత్వమే కారణమని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కేడర్ స్ట్రెంత్ ఇవ్వాలని, రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, అడిసినల్ వర్కర్స్‌ను ఆప్కాస్‌లోకి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని చెప్పారు. సమ్మెలో అమినేటిస్ సెక్రటరీలతో పని చేపించుకోవాలని చూస్తున్నారని తెలిపారు. నీళ్ల తిప్పడం వల్ల పైప్ లైన్ సమస్యలు వస్తే దాని కమిషనర్ బాధ్యత వహించాలని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ కోశాధికారి గోపి మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి వీడి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని కోరుతున్నట్లు చెప్పారు. ప్రజలకు అవసరమే కలిగితే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్, సహాయ కార్యదర్శిలు ఎం.ఆనంద రావు, టి.బ్రహ్మ నంద రెడ్డి, మున్సిపల్ నగర అధ్యక్షులు సుంకర రవి, ప్రధాన కార్యదర్శి వై.ఎం.కేశవులు, వాటర్ నాయకులు కె.సుబ్బారాయుడు, గురువయ్య, గోవర్ధన్, చాపయ్య, జయరాం, రాంమోహన్, శ్రీకాంత్, మహేశ్వర రెడ్డి, విజయ్. ప్రసాద్, లోకేష్, జయపుత్రడు,వెంకట సుబ్బయ్య, శివ, చంద్రాయుడు, యల్లయ్య, సోమిరెడ్డి, సత్యనారాయణ, శివ, రాజా, చిన్న రెడ్డయ్య, చిన్న ఓబులయ్య, నారాయణ, సుబ్బారాయుడు, ఆంజనేయులు, శ్యాం బాబు, సందీప్ సాగర్, సుబ్బయ్య, రమణ, ప్రసన్న కుమార్, రమేష్ బాబు, గోపాల్, పాలకొండయ్య, శాంతమ్మ, పవన్, ఈశ్వరయ్య, ఈశ్వర్ రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

‘మయోపియా’పై జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి- కడప అర్బన్

పిల్లల్లో వేగంగా మయోపియా కంటి వ్యాధి పెరుగుతుందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్‌విపిఇఐ వైద్యులు కన్సల్టెంట్ ఆప్టోమెట్రిస్ట్, మయోపియా స్పెషలిస్ట్ డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి సూచించారు. నగరంలోని ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రాంగణంలో మంగళవారం మయోపియా కంటి వ్యాధి పై తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో ప్రస్తుత మయోపియా పెరగడం గమనిస్తే ఇది 2050 నాటికి ప్రపంచ జనాభాలో సగం మందికి అంటే ప్రతి ఇద్దరిలో ఒకరు ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉందన్నారు. పిల్లల్లో మయోపియా వేగంగా పెరగడం పైన ఆందోళన వ్యక్తం చేశారు. మయోపియా వ్యాధి సోకిన వారు దగ్గర వస్తువులను స్పష్టంగా చూడగలుగుతారని, దూరపు వస్తువులు వారికి అస్పష్టంగా కనిపిస్తాయని పేర్కొన్నారు. దీనిని గుర్తించటంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమన్నారు. ఈ వ్యాధికి జన్యుపరమైన, జీవనశైలి రెండూ కారణమని చెప్పవచ్చన్నారు. ముందస్తు మయోపియా గుర్తింపు కోసం పెరుగుతున్న అవసరాన్ని తీర్చడానికి ఎల్ వీ పీఈఐ హైదరాబాద్, భువనేశ్వర్, విశాఖపట్నం, విజయవాడలోని తృతీయ కేంద్రాలలో ఇన్ఫర్ మయోపియా కేంద్రాలను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు.

కడపపై చిత్తూరు జట్టు ఘన విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసి సౌత్ జోన్ అండర్ -16 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప జట్టుపై ఇన్నింగ్స్ ఐదు పరుగుల తేడాతో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో మొదటి ఇన్నింగ్స్ లో కడప జట్టు 139 పరుగులు చేసింది. చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 383 పరుగులు చేసింది. ఆరు వికెట్ల నష్టానికి 193 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు 85.0 ఓవర్లలో 293 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చెందింది. ఆ జట్టులోని కశ్యప్ రెడ్డి 37 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని జయప్రకాష్ 3, దినేష్ 3, తేజస్ 2 వికెట్లు తీసుకున్నారు.

ఉర్దూ విద్యా సంస్థలను బలోపేతం చేయండి

ప్రజాశక్తి- కడప అర్బన్

రాష్ట్రంలోని ఉర్దూ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, ఉర్దూ అంగన్వాడీల స్థాపన నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఒక కార్యాచరణ ప్రకటించి అభివృద్ధి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముష్తాఖ్ హుస్సేన్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మెగా డిఎస్సిలో ఉన్నతీకరించిన ఉన్నత పాఠశాలలు, మోడల్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయ పోస్టులు చూపించలేదని, దీంతో ఆ పాఠశాలలో విద్యాభ్యాసం కష్టతరంగా మారిందని తెలిపారు. 1997, 2000 సంవత్సరాలలో ఉర్దూ స్పెషల్ డిఎస్సి రోష్ని పథకం కింద దాదాపు 210 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉర్దూ విద్యారంగానికి జీవం పోశారని వారు పేర్కొన్నారు.

8 గంటల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ప్రజాశక్తి - గోపవరం

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి మూడు సంవత్సరాలుగా విద్యుత్ స్తంభాల సౌకర్యం లేక గ్రామస్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో చాలా దూరం నుండి కర్రల సహాయంతో విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నారు. వాన గాలి వచ్చినప్పుడు కర్రలు కిందపడిపోవడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి ఇబ్బందులు పడేవారు. ఈనెల 13న కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు సమస్యను నియోజకవర్గ యువ నాయకులు రితీష్ రెడ్డికి వివరించారు. ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, 48 గంటల్లో విద్యుత్ స్తంభాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు రితీష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కాంట్రాక్టర్ ప్రసాద్ రెడ్డి, బ్రాహ్మణపల్లి నాయకులు శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎండిపోతున్న చీనీ చెట్లు

ఆందోళనలో రైతన్నలు

ప్రభుత్వమే చెట్లను కాపాడాలని వేడుకోలు

ప్రజాశక్తి వీరపునాయునిపల్లె/కమలాపురం

వీరపునాయునిపల్లె మండలం తలపనూరు గ్రామంలోని చీటి చెట్లు నీరు లేక ఎండిపోతున్నాయి. బోర్లలో నీరు ఎండిపోవడంతో నీటి తడులు లేక ఎండు దశకు చేరుకుంటున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెట్ల ఆకులు, కాయలు వాడిపోయి రాలుతుండడంతో కొందరు రైతులు ట్యాంకర్లతో నీటిని తోలి వాటికి తడులు అందిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.1000 ఖర్చు చేసి ట్యాంకర్లతో నీటిని తోలుకుంటున్నారు. ఇటీవల మండలానికి వచ్చిన ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రైతుల ఇబ్బందులు త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వారు రేపు, మాపు అంటూ పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చెట్లు ఎండిపోతున్నాయని, పరిస్థితి ఇలాగే ఉంటే ఆత్మహత్యలే శరణ్యమని పేర్కొంటున్నారు. తమ ఊరిలోని చెరువుకు నీరొస్తే దాదాపు 200 ఎకరాలకు సాగు, తాగునీటి కష్టాలు తీరుతాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ నీటి సమస్య తీర్చాలని రైతులు కోరుకుంటున్నారు.



ప్రయివేట్ ట్యాంకర్ ద్వారా చీనీ చెట్లకు నీటిని పడుతున్న రైతు

కందుల మురళీమోహన్‌రెడ్డిపై దాడి

- ఆస్తి తగాదాలే కారణం!

ప్రజాశక్తి - కడప

కందుల మురళీమోహన్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే కందుల శివా నందరెడ్డి కుమారుడు కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి అనుచరులు మంగళవారం దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా కందుల మురళీమోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తన పెద్దమ్మ రాజేశ్వరమ్మతో ఆస్తులు పంచుకునే విషయమై మాట్లాడేందుకు రాజారెడ్డి వీధిలోని కందుల ఓబుల్‌రెడ్డి అపార్ట్‌మెంట్‌కు వెళ్లానని చెప్పారు. ఆ సమయంలో చంద్ర ఓబుల్‌రెడ్డి వచ్చి తనను ఇంటి నుంచి బయటకు వెళ్లమని గట్టిగా అరిచారని పేర్కొన్నారు. తాను నిరాకరించడంతో చొక్కా పట్టుకుని బయటకు గెంటడంతో గొడవ మొదలైందని తెలిపారు. అతని అనుచరులు, గన్‌మ్యాన్లు మూకుమ్మడిగా దాడి చేయడంతో స్పృహ కోల్పోయినట్లు తెలిపారు. ఎక్కడ చంపుతారో అన్న భయంతో వెంటనే తేరుకొని అక్కడినుండి బయటపడేందుకు ప్రయత్నించానని చెప్పారు. తన ఇంటికి వచ్చి ప్రాణాలు తీస్తానని బెదిరించారని వాపోయారు. తమది ఉమ్మడి కుటుంబమని ఆస్తులు పంచుకో వడానికి మాట్లాడేందుకు వెళితే ఇలా జరగడం చాలా దారుణం అన్నారు. ఆస్తి అంతా కాజేసేందుకే తనపై ఈ విధంగా దాడికి దిగినట్లు తెలుస్తుందన్నారు. పోలీసుల వద్దకు వెళ్లి రక్షణ కావాలని కోరినట్లు తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపాలి

ప్రజాశక్తి - చెన్నూరు : టిడిపి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఏడాది దాటిన అమలు చేయకపోగా ప్రజలను మోసం చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపాలని కమలాపురం నియోజవర్గం వైసిపి పోచం రెడ్డి నరేన్ రామానుజన్ రెడ్డి అన్నారు. మంగళవారం చెన్నూరులోని గోసన కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకిచ్చిన ఏ హామీ అమలు చేయకపోగా తన కుమారుడు రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని ఆయన విమర్శించారు. మనమంతా సమిష్టిగా కృషిచేసి వైసిపి అధికారంలోకి తీసుకురావాలని ఆయన కార్యకర్తలను కోరారు. గతంలో కార్యకర్తలకు అన్యాయం జరిగిందని 2.0 ప్రభుత్వంలో కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని అందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని కోరారు. సమావేశంలో ఎంపిపి చీర సురేష్ యాదవ్, మండల కన్వీనర్ జీవన్ భాస్కర్ రెడ్డి, వైసిపి నాయకుడు దిలీప్ కుమార్ రెడ్డి, కొండపేట సర్పంచ్ తుంగ చంద్ర యాదవ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎస్.వి. నారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షులు చిన్న, నిత్య పూజయా, దేవుడి భాస్కర్ రెడ్డి, టి.ఎన్ చంద్ర రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, కార్తీక్ రెడ్డి శ్రీనివాసరాజు బలిసింగపల్లె భాగ్యమ్మ, అల్లి శ్రీరామ్మూర్తి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రిమ్స్‌లో అన్నదానం

ప్రజాశక్తి- కడప అర్బన్ : కందుల విద్యాసంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి తండ్రి శివానందరెడ్డి జ్ఞాపకార్థం ప్రతి మంగళవారం, శుక్రవారం రిమ్స్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు గత సంవత్సరం నవంబర్ నుంచి అన్నదాన సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం, తమ వారి వైద్య సహాయార్థం, తమకు తెలిసిన వారిని పలకరించడం కోసం వచ్చి తమ దగ్గర ఉన్న డబ్బు సరిపోక ఇబ్బంది పడే వారికి సమయానికి ఆహారం అందించాలనే ఉద్దేశంతో అన్నదాన కార్యక్రమం ప్రారంభించామని తెలిపారు. ప్రతీ వారం సుమారుగా వెయ్యి భోజన పొట్లాలు, మనిషికి 2 వాటర్ ప్యాకెట్లు పంచుతున్నట్లు తెలిపారు

వివక్షత, హక్కుల హరణపై పోరాడాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

దళితుల భూముల కబ్జా, వివక్షత, హక్కుల హరణపై పోరాడాలని, గ్రామీణ ఆధిపత్య వర్గాలతో ప్రభుత్వాలు రాజీ పడి పాలిస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు ఎన్.నారాయణ జిల్లాలోని దళితుల భూముల భూకబ్జాలకు వ్యతిరేకంగా చేస్తున్న ‘రిలే నిరాహారదీక్షల’ ఆయన సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 36 మండలాలలో దళితుల భూముల కబ్జా, వివక్షత, గ్రామ బహిష్కరణలు, దాడులు, హక్కుల హరణ, ప్రభుత్వాలు మారినా, పాలకులు మారిన జరుగుతున్నాయని ఆరోపించారు. దళిత, బహుజన వర్గాల బాధితులు ఒంటరి పోరాటాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వారికి మనోధైర్యాన్ని కల్పించే సంఘీభావ పోరాటాలు సమాజంలో రావాల్సిన అవసరం ఉందన్నారు. దళిత జనుల బాధాతప్తరిత జీవితాలు వింటే దిగ్భ్రాంతి కలిగి స్తున్నాయన్నారు. దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు ఎన్.నారాయణ మాట్లాడుతూ కాశీనాయన మండలం మూలపల్లె గ్రామంలో దళితుల భూములు ఆక్రమించుకుని అనుభవించుకుంటున్నారని ప్రశ్నిస్తే, పై అధికారులకు ఫిర్యాదు చేస్తే, చంపుతామని బెదిరిస్తున్నారని, అధికారులు కూడా చూసి చూడనట్టుగా వెళుతూ బాధితులపైనే బల ప్రయోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ.రాము, కెవిపిఎస్ జిల్లా నాయకులు జితేంద్ర., దళిత నాయకులు జార్జి., ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు మునెయ్య, బిసి సంఘం జిల్లా నాయకులు వెంకటసుబ్బయ్య మద్దతు తెలిపారు.

మేకల శివార్జునకు సన్మానం

ప్రజాశక్తి కడప అర్బన్



శివార్జునను సన్మానిస్తున్న డిఇఒ

బిటియు ఎపి రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన మేకల శివార్జునను డిఇఒ షంషుద్దీన్ మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యా లయంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మేకల శివార్జున మాట్లాడుతూ ఇటీవల ప్రమోషన్లు, బదిలీలు సమర్థవంతంగా, ప్రశాంతంగా, విజయపథంలో నిర్వహించిన డిఇఒకు అభినందనలు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గ ఉపాధ్యాయులలో ఐకమత్యాన్ని పెంపొందింప చేయడం, వారి హక్కులను కాపాడడం, వారి ఆత్మ గౌరవాన్ని పెంపొందింప చేయడమే లక్ష్యంగా బిఇయు పనిచేస్తుందన్నారు. అన్ని రకాల పాఠశాలల లో తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని, విద్యార్థులు మాధ్యమాన్ని ఐచ్ఛికంగా తీసుకునే వెసులుబాటు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.సుదర్శన్ బాబు, కడప జిల్లా అధ్యక్షుడు మేంద్రగుత్తి గంగరాజు, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్టా గంగాధర్, సురేంద్ర, కార్యదర్శులు గణేష్ పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-కాశినాయన

సిఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరమని బద్వేల్ టిడిపి సమన్వయకర్త రితీశ్ రెడ్డి అన్నారు మంగళవారం బద్వేలు టిడిపి కార్యాలయంలో కాశినాయన మండలంలోని బాలాయపల్లె, మిద్దెల గ్రామానికి చెందిన సుధా వెంకటరమణమ్మ, చింతాకు రెబకమ్మకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి, భద్రతకు కూటమి ప్రభుత్వం ఎప్పటికి కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకుడు బసిరెడ్డి రవీంద్రారెడ్డి, పోలిరెడ్డి, క్రిష్ణారెడ్డి, జయరామిరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు..


మాట్లాడుతున్న మహమ్మద్ షబ్బీర్

ఇఒకు చెక్ పవర్ ఇవ్వకపోవడం దారుణం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మేజర్ పంచాయతీ ఇఒ మాధవరెడ్డికి జిల్లా అధికారులు చెక్ పవర్ ఇవ్వకపోవడం దారుణమని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 60 వేల జనాభా ఉన్న వేంపల్లె పంచాయతీలో నిధులు ఉన్నప్పటికీ ఇఒకు చెక్ పవర్ లేదన్నారు. తద్వారా పనులు చేయలేక పోతున్నట్లు చెప్పారు. వర్షాకాలంలో పాపాఘ్ని నదిలో నీటి మట్టం తగ్గడంతో రాజీవ్‌నగర్, ఇమామ్‌నగర్, గండి రోడ్డు, కడప రోడ్డు, శ్రీరామ నగర్, పులివెందుల రోడ్డు ప్రాంతాల్లో 10 రోజుల నుండి తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. చిన్న పని చేయాలన్నా చెక్ పవర్ లేక ఖర్చు చేయలేమని అధికారులు అంటున్నారని తెలిపారు. ప్రజా ఇబ్బందులను తొలగించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఇఒకు చెక్ పవర్ ఇవ్వకపోతే గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో టిడిపి నేతలు శేషారెడ్డి, తక్కెల షరీఫ్, నారాయణ రెడ్డి, మహబూబ్ షరీఫ్ పాల్గొన్నారు.

రక్తదానంతో ఆరోగ్యం మెరుగు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రక్తదానంతో పాత రక్తకణాలు పోయి వాటి స్థానంలో కొత్త రక్తకణాలు వచ్చి ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్, ఆగస్టే ఫౌండేషన్ చైర్మన్ కె జాన్ తెలిపారు. రక్తదాన ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వలు చాలా తక్కువ శాతం ఉన్నాయన్నారు. అత్యవసర చికిత్స సమయంలో రక్తం చాలా అవసరం అవుతుందన్నారు. రక్తం నిలువల శాతం పెరిగేందుకు యువతతోపాటు అందరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శిబిరంలో 16 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవ చైర్మన్ రఘురామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఈశ్వర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ప్రతాపరెడ్డి, జివి లోకేష్ రెడ్డి, శివరామిరెడ్డి, రమణారెడ్డి, జూటూరు విజయకుమార్, రామ్మోహన్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోతాదు మించి యూరియా వాడొద్దు

ప్రజాశక్తి - చక్రాయపేట

వరి పంటకు మోతాదు మించి యూరియా వాడవద్దని, వాడితే దిగుబడి తగ్గుతుందని వ్యవసాయ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కుమార్ కాల్వ గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఈ ఏడాది మండలంలో దాదాపు వెయ్యి ఎకరాల్లో వరి పంట సాగు చేశారని, ఇందువల్ల యూరియా కొరత రాగా, తెప్పించామన్నారు. యూరిగా అధికంగా వాడడం వల్ల దోమపోటు, తెగుళ్ల వస్తాయన్నారు. దిగుబడి గణనీయంగా తగ్గుతుందన్నారు. వరిసాగులో రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విఎఎలు పార్వతి, శ్రీనివాసులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటేశు, కొండారెడ్డి, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరంలో తాళాలు వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలను చిన్న చౌకు పోలీసులు అరెస్టు చేశారని డిఎస్‌పి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం చిన్న చౌక్ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్జల శ్రీనివాస్‌తో పాటు ఒక బాల నేరస్తుడిని అరెస్టు చేశారని పేర్కొన్నారు. వీధి వద్ద నుంచి బంగారు బుట్ట కమ్మలు, ఉంగరం, 1.500 కిలోల వెండి వస్తువులు, మోటార్ సైకిల్, ఆరు చేతి గడియారాలు, రెండు కెమెరాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సిసి కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా దొంగలను దేవుని గడప ఆర్చి వద్ద పట్టుకున్నారని చెప్పారు. నిందతులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసులకు నగదు బహుమతి అందజేశారు. సమావేశంలో చిన్నచౌక్ సిఐ ఓబులేసు, ఎస్ఐలు రాజరాజేశ్వర్ రెడ్డి, రవికుమార్, ఎఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్ చంద్రమోహన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడిన కేసులో వ్యక్తి..

ప్రజాశక్తి-అట్లూరు : సిద్ధవటం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అట్లూరు మండలం, చెల్లంగారిపల్లి సమీపంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి అభయా రణ్యంలో ముగ్గురు వ్యక్తులు, వన్యప్రాణులను వేటాడిన కేసులో గోపవరం మండలం, వెంకట రామాపురం గ్రామానికి చెందిన బొడిమి గుంట, రమణయ్య అనే వ్యక్తిని సోమవారం రాత్రి అరెస్టు చేసినట్లు సిద్దవటం అటవీశాఖ క్షేత్ర అధికారి కళావతి తెలిపారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు తమ అటవీ సిబ్బందితో వెళ్లి పెనుసిల, లక్ష్మీ నరసింహ అభయారణ్యంలో వన్యప్రాణి కొండ గొర్రెను ముగ్గురు వ్యక్తులు నాటు తుపాకీతో వేటాడి చంపారన్నారు. మాంసాన్ని పెద్ద మొత్తంలో విక్రయించడానికి, అందులో కొంత వారు అడవిలో వండుకొని తినితుండగా సోమవారం రాత్రి దాడులు చేశామని చెప్పారు. ఇందులో రమణయ్యాను అదుపులోకి తీసుకున్నామని, మరో ఇద్దరు గుమ్మల వెంకటసుబ్బయ్య, గుమ్మల శీను అనే వ్యక్తులు పారిపోయారని పేర్కొన్నారు. వీరి ఆచూకీ కోసం సిద్ధవటం, అట్లూరు, భాకరాపేట, బద్వేలు, పలు గ్రామాల్లో విస్తృ తంగా గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నాటు తుపాకీ, వన్య ప్రాణుల కాళ్లు వండిన మాంసం కత్తులు, టార్చి లైట్లు, ఒక ద్విచక్ర వాహనం స్వా ధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడ్డ నిందితుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు చేయించి సిద్ధవటం కోర్టులో హాజరు పరిచామని తెలిపారు.


నిందితుడిని పట్టుకున్న ఫారెస్టు అధికారులు

ఐదుగురు జూదరులు..

ప్రజాశక్తి - వేంపల్లె : మండలంలోని టి.వెలమవారిపల్లె గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు ప్రసాద్‌రెడ్డి నిమ్మ తోటలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారిని అరెస్టు చేశారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. దాడిలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల : మండలంలోని కలమల్ల గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. కృష్ణానగర్‌లో నివాసం ఉంటున్న సువార్తమ్మ డ్వాక్రా సంఘంలో సభ్యురాలుగా ఉంది. సం ఘంలో తీసుకున్న రుణానికి కంతు చెల్లించాలని సోమవారం తన కుమారుడు వెంకట్‌ను డబ్బులు అడగ్గా, తన వద్ద లేదని చెప్పాడు. కంతు డబ్బులు కట్టకుంటే సంఘంలో పరువు పోతుందనే ఉద్దేశంతో ఇంటిలో ఫ్యానుకు చీరతో ఉరి వేసు కుంది. స్థానికులు గమనించి ఆమెను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ సువార్తమ్మ (35) చనిపోయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ నాగరాజు

ప్రజాశక్తి - చాపాడు

సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. చాపాడు పిహెచ్‌సిని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు అధికంగా సోకే అవకాశం ఉందన్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ఫార్మసీ గది, ల్యాబ్‌ను పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి లార్వా సర్వే చేపట్టాలన్నారు. డయేరియా వంటివి రాకుండా జాగ్రత్తగా పడాలన్నారు. షెడ్యూల్ ప్రకారం వ్యాక్సినేషన్ జరగాలని సూచించారు. కార్యక్రమంలో ఎండమాలజిస్ట్ ఎస్.ఖాజామొద్దీన్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ మల్లేష్, వైద్యులు శివప్రసాద్‌రెడ్డి, శ్రీవాణి, పిహెచ్ఎన్ సుకన్య, సూపర్వైజర్ బాబురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం : మండలంలోని బిదినంచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీ మాసోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమకాటు వల్ల సంభవించే వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మలేరియా, డెంగీ, చికన్‌గున్యా వంటి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి సుకుమార్, పిహెచ్ఎన్ పద్మావతమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

ఇళ్ల మీద ఉన్న 33 కెవి లైన్ త్వరలో మార్పు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల మీదుగా ఉన్న 33 కెవి లైన్ (పెద్దలైను) త్వరలో మార్పు జరగనున్నట్లు అర్బన్ విద్యుత్‌శాఖ ఎఇ ప్రియదర్శన్ రెడ్డి తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో పెద్ద లైను సమస్య ప్రధానంగా ఉందన్నారు. పెద్దలైను ఇళ్ల మీదుగా పోవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో చాలా కిందకు వంగిపోయాయని తెలిపారు. వీటివల్ల పలు ప్రమాదాలు జరిగాయన్నారు. సోమవారం విద్యుత్ కార్యాలయంలో ఎఇ మాట్లాడుతూ కడప రోడ్డులోని క్రాంతినగర్ ప్రాంతంలో పెద్ద లైను సమస్య ఉందన్నారు. దాని స్థానంలో 33 కెవి సబ్ స్టేషన్ నుంచి వేంపల్లి రోడ్డు మీదుగా వెళ్లి కడప రోడ్డు వైపు జువారి రైల్వే బ్రిడ్జి వరకు నూతన 33 కెవి లైను నిర్మాణం సుమారు మూడు కిలోమీటర్లు జరగనున్నట్లు తెలిపారు. మహాత్మా నగర్ వెనకవైపు నుంచి శాంతినగర్, ఎర్రబ్బచేలు ఏరియా మీదుగా సుమారు మూడు న్నర కిలోమీటర్ల మేర నూతన 33 కెవి లైన్ నిర్మాణం జరగనుందని తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. సంబంధిత కాంట్రా క్టర్లు త్వరలో 33 కెవి లైన్ నిర్మాణ పనులు ప్రారం భిస్తారని పేర్కొన్నారు. వేసవి కాలం అధిక లోడు సమస్యలు రాకుండా ఇప్పటికే పలు ప్రాం తాల్లో కొత్త ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పా టు చేశామన్నారు. ప్రస్తుతం నూతనంగా ఐసిఎల్ వద్ద, శాంతి నగర్ లోని ఎన్టీఆర్ కాలనీలో, సుం దరయ్య నగర్‌లో నెల లోపు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయ నున్నట్లు ఆయన వివరించారు. పట్టణంలో విద్యుత్ ఉత్పత్తి చేసే సోలార్ సిస్టంను బిగించుకునేందుకు ఎక్కువగా ప్రజలు ఆసక్తి చూపు తున్నారని తెలిపారు. 3కెవి సోలార్ సిస్టం బిగించుకునేందుకు దాదాపు రూ.2లక్షల పదివేలు ఖర్చు వస్తుందన్నారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి బీసీలకైతే రూ.98,000 రాయితీ ఇస్తున్నాయని తెలిపారు. ఇంట్లో ఎసి ఉన్నా కూడా ఈ 3కెవి సోలార్ సిస్టం బిగించుకుంటే సరిపోతుందన్నారు. ఇందులో కూడా అదనంగా ఉత్పత్తి అయిన విద్యుత్తుకు రూ. 2.10పైసల ప్రకారం విద్యుత్ సంస్థ వినియోగదారుడికి చెల్లిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎఇ సూచించారు.


ఎఇ ప్రియదర్శన్‌రెడ్డి

ప్రభుత్వ మోసాలను ఎండగడతాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - దువ్వూరు

కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల వద్దకెళ్లి ఎండగడతామని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. వైసిపి దువ్వూరు మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం కానాల వేదికలో నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్.రఘురామిరెడ్డి మాట్లాడుతూ సుపరిపాలన అంటే పరిపాలన బాగా చేయాలి.. చెప్పినవి నెరవేర్చాలన్నారు. సుపరిపాలన అంటూ ఇంటింటికి తిరుగుతున్న టిడిపి వారి హామీలను తాము ఎండగడతామన్నారు. టిడిపి ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. దాన్ని పోలీసులను అడ్డుపెట్టుకొని అణగదొక్కాలని అరాచకాలు చేస్తున్నారని విమర్శించారు. రైతులు నష్టపోతే వారిని పరామర్శించేందుకు జగన్ వెళితే వీరికి ఎందుకు భయమని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి, జెడ్పిటిసి కృష్ణయ్య, మాజీ జెడ్పిటిసి గోపిరెడ్డి బాబు, ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, కానాల ఓబుల కొండారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాపాడు : టిడిపి మోసపూరిత వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి కార్యకర్తలకు సూచించారు. మండల పరిధిలోని అల్లాడుపల్లె దేవళాల్లో మంగళవారం వైసిపి మండల విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చారన్నారు. 14 నెలలు పూర్తి అవుతున్న ఉచిత బస్సు, తల్లికి వందనం పూర్తిస్థాయిలో అమలు చేయడంలో, రైతులకు భరోసా అందించడంలో వెనుక పడ్డారన్నారు. కార్యక్ర మంలో ఎంపిపి టి.లక్షుమయ్య, మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పి టిసి బాల నరసింహారెడ్డి, వైసిపి నాయకులు రవిశంకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, వినయ్‌కుమార్ రెడ్డి, శాంతరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టోను ప్రజలకు గుర్తుకు చేయాలని వైసిపి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జమ్మల మడుగు మండలానికి చెందిన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలను ఎలా మోసం చేసిందో ప్రతి వైసిపి కార్యకర్త ప్రజల్లోకి తీసుకు పోవాలని కోరారు. కార్యక్రమంలో పొన్నపురెడ్డి గిరిధర్ రెడ్డి, గూడెంచెరువు నాగేశ్వరరెడ్డి, బొమ్మేపల్లి ప్రతాప్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, గోరిగనూరు బోనం సురేష్, సుబ్రమణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

వేంపల్లె : కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి వైసిపి నాయకులు, కార్యకర్తలకు సూచిం చారు. వైసిపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యా రంటీ కార్యక్రమంపై సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చేది వైసిపి ప్రభుత్వమే కాబట్టి ఏ ఒక్క కార్యకర్త కూడా నిరుత్సాహ పడకుండా వైసిపి కోసం పని చేయాలని జడ్‌పిటిసి కోరారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అనే క్యూఆర్ కోడ్ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల ఉపాధ్యక్షులు రవిశంకర్ గౌడ్, మునీర్, బిఎస్ షెక్షా వలి, వైసిపి రాష్ట్ర ప్రచార సంయుక్త కార్యదర్శి నిసార్, కటిక చంద్రశేఖర్, చల్లా బాలాజీ పాల్గొన్నారు.

ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి దేవి పద్మలత సూచించారు. మండల పరిధిలోని చియ్యపాడు, గుంతచియ్యపాడు గ్రామాల్లో మంగలవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరాకు రూ.84 ప్రీమియం ఆగస్టు 15లోగా చెల్లించాలన్నారు. నారుమడులు వేసుకోవడానికి పనులు ప్రారంభిస్తున్నారని, రైతులు జాగ్రత్తలు పాటించి విత్తనాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకట రమణారెడ్డి, విఎఎ బేబీ, రాము, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూస్తాం

ప్రజాశక్తి- వేంపల్లె

ప్రజలకు తాగునీటి సమస్య తీర్చేందుకు పాపాగ్ని నదిలో కొత్త ఫిల్టర్లను వేసినట్లు సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. పాపాగ్ని నదిలో వేసిన ఫిల్టర్లను మంగళవారం సర్పంచ్ తనిఖీ చేసి నీటిమట్టం పరిశీలించేందుకు మోటర్లను ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపాగ్ని నదిలో నీటి శాతం తగ్గడంతో ఆయా ప్రాంతాలకు తాగునీటి సమస్య ఉండ డంతో ఫిల్టర్లను వేయాలని అధికారులను కోరడంతో కొత్తవి వేసినట్లు చెప్పారు. ఫిల్టర్లు వేయడం వల్ల వేంపల్లెలోని ఆయా ప్రాంతాల ప్రజలకు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

యాంత్రీకరణతో పంట సాగు

ప్రజాశక్తి - వేముల

కుప్పగుట్టపల్లి, చింతల్ జూటూర్ గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ జిపి ఓబులేసు మాట్లాడుతూ యాంత్రీకరణ పద్ధతి ద్వారా పంటల సాగులో ఖర్చులు తగ్గి, మంచి దిగుబడులు సాధిస్తారన్నారు. మినుములో వచ్చే పల్లాకు తెగులు, ఆకుమచ్చ తెగులు నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎఇఒ సురేష్, విహెచ్ఎ లక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి - వేంపల్లె

పురుగు మందులు, ఎరువులు అధిక ధరలకు, సరైన బిల్లులు లేకుండా విక్రయిస్తే, అలాంటి ఎరువుల దుకాణాల యాజమానులకు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తిరుపతి విజిలెన్స్ డిఎస్‌పి మల్లికార్జునరావు, కర్నూలు జిల్లా ఎడిఎ వెంకటేశ్వరులు హెచ్చరించారు. మంగళవారం వేంపల్లెలోని పురుగు మందులు, ఎరువుల దుకాణాలను రాష్ట్రస్థాయి అంతర్ జిల్లా విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. వేంపల్లెలోని బైరిశెట్టి గంగిశెట్టి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, తేజ ఫెర్టిలైజర్స్‌తోపాటు ఇతర ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు, బిల్లు బుక్స్, స్టాక్ ను పరిశీలించారు. బైరిశెట్టి గంగిశెట్టి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో ఉన్న రూ.24 వేలు విలువ చేసే మెగ్నీషియం సల్ఫేట్ శాంపిల్ తీసి విక్రయాలను నిలుపుదల చేయాలని డీలరును ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులనే విక్రయించాలన్నారు. తనిఖీల్లో డిఎఒ కార్యాలయ వ్యవసాయ అధికారి గోవర్ధన్, వేంపల్లె మండల వ్యవసాయ అధికారి శివశంకరరెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండలంలో ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు మంగళ వారం తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ, విజిలెన్స్ డిపార్ట్‌మెంట్స్ సం యుక్తంగా తనిఖీలు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా విజిలెన్స్ డిఎస్పి పి. మల్లికార్జున్‌రావు, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.వెంకటేశ్వర్లు, స్థానిక మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ షాపుల్లో తనిఖీలు నిర్వ హించారు. ఇందులో భాగంగా శ్రీగురు బాలాజీ ఫర్టిలైజర్స్ షాప్‌లో తనిఖీలు నిర్వహించారు. కార్యక్ర మంలో జెడిఎ కార్యాలయం టెక్నికల్ వ్యవసాయ అధికారి గోవర్ధన్, పులివెందుల డివిజన్ టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎరువులు దుకాణాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

ప్రజాశక్తి - చాపాడు

అధికారులు తమ విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హెచ్చరించారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో మంగళవారం మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు చేపట్టిన పనుల పురోగతి, అమృత్ స్కీం కింద మంజూరైన వాటర్ పైప్‌లైన్ టెండర్ గురించి చర్చించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలో పరిశుభ్రత, నీటికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, కమిషనర్ శ్రీనివాసుల రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ నిరంజన్‌రెడ్డి, పబ్లిక్ అండ్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణ, డిప్యూటీ ఇంజినీర్ కావ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎపి రవీంద్ర, పట్టణ అధ్యక్షులు దాసరి బాబు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించడంతోపాటు క్రీడలు, జ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యాలు ప్రదర్శించడంలో సమర్థులుగా అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఇఒ-2 రామాంజనేయులురెడ్డి తెలిపారు. వరల్డ్ యూత్ స్కిల్స్ డే సందర్భంగా మంగళవారం విద్యార్థులకు వృత్తి విద్యలో భాగంగా క్విజ్, రోల్ ప్లే, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రఓబుల రెడ్డి, జనార్ధన్, తేజస్దీప్, యోహాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గండి క్షేత్రంలో బహిరంగ వేలం

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం 10గంటలకు ఇ-టెండర్, స్టీల్ టెండర్, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. గండి క్షేత్రం ఆవరణలో పూలు విక్రయానికి, టోల్‌గేట్ వసూలుకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. డిపాజిట్ చెల్లించిన వారు మాత్రమే వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

- మున్సిపల్ కమిషనర్ రాముడు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. మంగళవారం పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ వన చిన్నప్ప పర్యావరణం పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ రాముడు పర్యావరణం పట్ల అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం రాబోయే రోజుల్లో వచ్చే సమస్యల గురించి వివరించారు. ఇప్పటికే పట్టణంలో ప్లాస్టిక్ వాడకం తగ్గిందని, మరి కొన్ని రోజుల్లో పూర్తిస్థాయిలో నిషేధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కల్యాణిరెడ్డి, దేవిరెడ్డి హిమజ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్